



గోపాలపట్నం ప్రాంతంలో నిలిచిన ట్రాఫిక్

చప్పగా జగన్ రోడ్ షో

జనాన్ని తరలించేందుకు వైసీపీ అభ్యర్థుల తిప్పలు

పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున పంపిణీ

- అభివాదం/నమస్కారం చేస్తూ ముందుకుసాగిన ముఖ్యమంత్రి
- అభివాదాలతోనే ముగిసిన ప్రచారం



నాయుడుతోట ప్రాంతంలో జగన్ బస్సు యాత్రలో కనిపించని జనం

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం విశాఖలో నిర్వహించిన రోడ్‌షో చప్పగా సాగింది. జనాలు పెద్దగా లేకపోవడంతో ఆయన రోడ్డుపక్కన, దుకాణాల వద్ద నిలబడిన వారికి బస్సులో నుంచే నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లాల్సి వచ్చింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసినప్పుడు, 2019 ఎన్నికల ప్రచార సమయంలో జగన్మోహన్‌రెడ్డికి నగరంలో మంచి స్పందన కనిపించింది. అయితే ఈసారి వాతావరణం అందుకు విరుద్ధంగా కనిపించిందని ఆ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో శనివారం రోడ్‌షో, 'మేమంతా సిద్ధం' సభలో పాల్గొన్న జగన్ రాత్రి సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం వద్ద గల టెరాకాన్ లేఅవుట్‌లో బస చేశారు. ఆదివారం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు నగర పరిధిలోని వేపగుంట జంక్షన్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సీఎం బస్సు యాత్ర ఉదయం తొమ్మిది గంటలకే వేపగుంట జంక్షన్‌కు చేరాల్సి ఉండగా...దాదాపు నాలుగు గంటలు ఆలస్యం అయ్యింది. దీంతో ఆటోల్లో వైసీపీ నేతలు తరలించిన మహిళలు, వృద్ధులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేపగుంట జంక్షన్‌లో బస్సు మీద నిలబడి ప్రజలకు అభివాదం చేసిన జగన్ ఆ తర్వాత లోనికి వెళ్లిపోయారు. నాయుడుతోట జంక్షన్ వరకూ జనాలు లేకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి, దుకాణాల ముందు నిలబడి

... మిగతా 6వ పేజీలో



మద్దిలపాలెం ప్రాంతంలో జగన్ బస్సు యాత్ర



జగన్ రోడ్‌షోకు ఆటోల్లో జనాల తరలింపు

బస్సు లోపల నుంచే...



సీఎం రోడ్ షోను విజయవంతం చేసేందుకు వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రధాన కూడళ్ల వద్ద కూడా ఆశించిన స్థాయిలో జనాలు లేకపోవడంతో నాయకులపై జగన్ అసహనం వ్యక్తంచేశారు. జనాలు లేకపోవడంతో జగన్ బస్సు లోపలకు వెళ్లిపోయి దారిపొడవునా నమస్కరిస్తూ ముందుకు సాగిపోయారు. అయితే జగన్ బస్సు వెంట భారీగా జనాలు ఉన్నట్టు కనిపించాలని వైసీపీ నాయకులు 200 బైక్‌లు ఏర్పాటుచేశారు. జగన్ బస్సును అనుసరించాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే వారు కూడా ఒకటి, రెండు కూడళ్లకే పరిమితమయ్యారు.

నగర వాసులకు నరకం

జగన్ పర్యటించే మార్గంలో విద్యుత్ వైర్లు తొలగింపు

- ఉదయం నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఉక్కపోతతో అల్లాడిన జనం
- రాత్రి పది గంటలకు కూడా చాలా ప్రాంతాల్లో పునరుద్ధరించని వైనం
- అదేవిధంగా జగన్ రావడానికి గంట ముందు నుంచే వాహనాల నిలిపివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షో ప్రజలకు అగచాట్లు మిగిల్చింది. రోడ్‌షో మార్గంలో విద్యుత్ వైర్లను ఆదివారం ఉదయాన్నే విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. అసలే వేసవికాలం, ఆపై విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం అల్లాడిపోయారు. సీఎం వస్తే ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపేయడం ఏమిటంటూ అంతా విద్యుత్ శాఖ కార్యాలయాలకు ఫోన్ చేసి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో చాలామంది ముఖ్యమంత్రులు నగరానికి వచ్చారని, ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని మండిపడ్డారు. ఆదివారం రాత్రి పది గంటలకు కూడా చాలా ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరించలేదు.



నగరంలోని ఓ ప్రాంతంలో రాత్రి 11 గంటలకు కూడా పునరుద్ధరణ కాని విద్యుత్

అలాగే జగన్ బస్సు రావడానికి కనీసం గంట ముందు నుంచే ఆ మార్గంలో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర వేపగుంట జంక్షన్‌కు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరితే, ఉదయం పది గంటల నుంచే పోలీసులు అక్కడ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వాహనచోదకులు కొద్దిసేపు చూసి ... మిగతా 6వ పేజీలో

టీడీపీ అభ్యర్థులకు బి.ఫారాలు



బి.ఫారాలు అందుకున్న అనంతరం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబునాయుడుతో ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అసెంబ్లీ అభ్యర్థులు గంటా శ్రీనివాసరావు (భీమిలి), వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు), పెతకంశెట్టి గణబాబు (విశాఖ పశ్చిమ), పల్లా శ్రీనివాసరావు (గాజువాక), కోళ్ల లలితకుమారి (ఎస్.కోట)

వచ్చే ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం మంగళగిరిలో గల కేంద్ర కార్యాలయంలో బీ.ఫారాలు అందజేశారు. చంద్రబాబునాయుడు నుంచి ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అసెంబ్లీ అభ్యర్థులు గంటా శ్రీనివాసరావు (భీమిలి), వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు), పెతకంశెట్టి గణబాబు (విశాఖ పశ్చిమ), పల్లా శ్రీనివాసరావు (గాజువాక), కోళ్ల లలితకుమారి (ఎస్.కోట) బి.ఫారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అందరూ కష్టపడాలని, అన్ని స్థానాలు గెలవాలని అన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఖండించాలని సూచించారు. ఆయన చేస్తున్న అబద్ధపు ప్రచారంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పేదవాడినని చెప్పుకుంటున్న జగన్ నైజాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

నేడు టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ నామినేషన్

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ లోక్‌సభ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన ఎంవీపీ కాలనీలోని డబుల్‌రోడ్డులో గల పార్లమెంటు ఎన్నికల కార్యాలయం నుంచి ఉదయం ఎనిమిది గంటలకు ర్యాలీగా ఓపెన్‌టాప్ వాహనంలో బయలుదేరతారు. ఇసుకతోట, మద్దిలపాలెం, గురుద్వార, సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, ఎల్ఐసీ బిల్డింగ్స్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఉదయం 11.46 గంటలకు శ్రీభరత్ నామినేషన్ దాఖలు చేస్తారు. కాగా, వైసీపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు.

పోలీసులకు 'నార్త్' రిటర్నింగ్ అధికారి షోకాజ్

- కేకే రాజు నామినేషన్ దాఖలు సమయంలో గందరగోళం
- నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందికి అనుమతి

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కేకే రాజు నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల నిబంధనలను అతిక్రమించడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులకు తాజాగా రిటర్నింగ్ అధికారి షోకాజ్ జారీచేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉత్తర నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి స్వీకరిస్తారు. ఈ సందర్భంగా కార్యాలయంలోకి అభ్యర్థితోపాటు మొత్తం ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థితోపాటు మొత్తం ఐదుగురిని లోపలకు పంపే బాధ్యత పోలీసులదే. అయితే ఈ నెల 19వ తేదీన (శనివారం) కేకే రాజుతోపాటు మొత్తం ఏడుగురు రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లోకి వెళ్లారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరించే కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకే ర్యాలీలు, ఊరేగింపులు అనుమతిస్తారు. అయితే కేకే రాజుతోపాటు ఆయన మద్దతుదారులు, వైసీపీ నేతలు పెద్దఎత్తున కార్యాలయంలోకి ప్రవేశించారు. దీంతో గందరగోళం ఏర్పడింది. కేకే రాజుతోపాటు ఆయన సతీమణి ఇద్దరూ నామినేషన్ వేయాల్సి ఉండడంతో రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లోకి వెళ్లారని పార్టీ నేతలు చెబుతున్నా, ఒకరు నామినేషన్ వేసిన తరువాత మరొకరు ఛాంబర్‌లోకి వెళ్లాలి. ఈ వ్యవహారంలో పోలీసుల పనితీరుపై అధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీతమ్మధార తహసీల్దారు కార్యాలయం ఎదుట విధులు నిర్వహించిన పోలీసులకు రిటర్నింగ్ అధికారి అఖిల షోకాజ్ జారీచేశారు. కేకే రాజుపై ద్వారకా పోలీసులకు ఆమె ఇప్పటికే ఫిర్యాదుచేశారు. ఇదిలావుండగా నామినేషన్ దాఖలు సమయంలో కేకే రాజు, ఆయన మద్దతుదారులు వ్యవహారం, వారికి సహకరించిన అధికారులు, పోలీసులపై ఎన్నికల సంఘానికి తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేశారు.



ప్రచారంలో విష్ణుకుమార్‌రాజు



అక్కయ్యపాలెం వద్ద బైక్ ర్యాలీలో జనసేన నాయకులు, కార్యకర్తలు

వైసీపీ పాలనలో అన్నీ కష్టాలే

» బీజేపీ 'ఉత్తర' అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 : గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రంలోని ప్రజలు త్వరలోనే విముక్తి పొందనున్నారని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎనభై అడుగుల రోడ్డులో భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసరాల ధరలతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలను పెంచి సామాన్యుని నడ్డి విరిచేశారని మండిపడ్డారు. ఈస్థితిలో ఎన్నికల్లో సుపరిపాలన అందించనున్న బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు జనసైనికులంతా సిద్ధం గా ఉన్నారన్నారు. ఆ పార్టీ సీనియర్ నేత సంకు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి శ్రేణుల మధ్య విభేదాలున్నట్లు పలు పార్టీలు ఆరోపిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

యువతకు రూ. 500!

» సీఎం పర్యటన పురస్కరించుకుని ప్రలోభాలు?



వాహనదారుల పేర్లు నమోదు చేస్తున్న వైసీపీ కార్యకర్త

సీతమ్మధార, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రచార యాత్రలో భాగంగా ఉత్తర, తూర్పు నియోజకవర్గాల్లో యువతకు నగదు పంపిణీ చేసినట్టు సమాచారం. యువతను ఆకట్టుకోవడానికి వీలుగా వారి పేర్లు రాసుకొని ఒక్కో బైక్‌కు రూ.500 చొప్పున వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్టు ఆరోపణలున్నాయి.

9 మందితో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ, అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులను ఆదివారం ఏఐసీసీ ప్రకటించింది. శ్రీకాకుళం నుంచి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం-బొబ్బిలి శ్రీను, అమలాపురం(ఎస్సీ) - జంగా గౌతమ్, మచిలీపట్నం- గొల్లు కృష్ణ, విజయవాడ- వల్లూరు భార్గవ్, ఒంగోలు- ఈద సుధాకర్ రెడ్డి, నంద్యాల- జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, అనంతపురం- మల్లికార్జున వజ్జల, హిందుపూర్ నుంచి బీఏ సమద్ షహీన్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన చేశారు.

'వాసుపల్లి'ని ఓడించండి'

జగదాంబ కూడలి, ఏప్రిల్ 21: అవినీతికి నిర్వచనంగా నిలుస్తున్న వైసీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌ను ఓడించాలని మాజీ కార్పొరేటర్, తెలుగు మహిళా నాయకురాలు పోలిపిల్లి జ్యోతి అన్నారు. ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక 30వ వార్డులో ఇంటింటికి ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు అన్ని విధాలుగా దగా చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరుచెప్పి మహిళల కుటుంబాలను వంచిస్తున్న జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. దక్షిణంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ గాజు గ్లాసుకు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. తాడివీధి, ఏనుగులవీధి, వార్డుబాయిస్ లైను ప్రాంతాల్లో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ హెచ్‌ఈసీ గ్రూప్‌లో బీవీకే విద్యార్థి ప్రతిభ

సీతంపేట, ఏప్రిల్ 21: భారతీయ విద్యా కేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థి ఆరుద్ర మయూఖ్ భాగవతుల ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ గ్రూపు ఫలితాలలో మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో 929 మార్కులు సాధించి కళాశాలలోని అన్ని గ్రూపుల్లో ప్రథముడిగా నిలిచాడు. ఈ సందర్భంగాప్రిన్సిపాల్ రమా అచంట, ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు రత్నశేఖర్, భరత్ ప్రియా పట్నాయక్ తదితరులు ఆరుద్ర మయూఖ్‌ను అభినందించారు. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించినట్టు ఆరు ద్ర తెలిపారు. ఐఏఎస్ అధికారి కావడమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు.

'బ్రాహ్మణులను గుర్తించిన పార్టీకే మద్దతు'

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 20: బ్రాహ్మణులను గుర్తించే రాజకీయ పార్టీలకు మాత్రమే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ కె.చరణ్‌కుమార్ సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని రాజకీయ పార్టీలు తమను అసలు గుర్తించలేదని, అలాంటి పార్టీలకు ఈ ఎన్నికల్లో వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. రాజకీయ పార్టీలు ఎప్పుడు ఉత్తరాంధ్ర నుంచి బ్రాహ్మణులు గుర్తించి టిక్కెట్లు ఇచ్చేవారని ఈ సారి గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ నియోజకవర్గంలో ద్రోణంరాజు కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీచేసేవారని, ఈ సారి ఎవరు దురదృష్టకరమన్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు 30వేల మంది బ్రాహ్మణుల ఓటర్లున్నారని కానీ, తమను గుర్తించలేదన్నారు.

క్రీడా పోటీల్లో భాను ప్రకాశ్‌కు పతకాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన పుప్పాల భాను ప్రకాశ్ మూడు బంగారు పతకాలు సాధించి తన సత్తా చాటారు. భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 5 వరకు నేపాల్‌లోని పోఖరా జిల్లాలోని రంగశాల స్టేడియంలో జరిగిన 9వ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన పుప్పాల భాను ప్రకాశ్ 100, 200, 400 మీటర్స్ పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే భాను ప్రకాశ్ సాధించిన విజయానికి విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిశోర్‌కుమార్ తదితరులు అభినందించారు.

29నుంచి పోర్టు స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 21: పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానునట్టు నిర్వాహకులు ప్రమోద్, నరేంద్ర తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, సిలంబం (కర్రసాము), ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, కరాటే, ఖోఖో, కబడ్డీ, స్విమ్మింగ్, స్కేటింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ తదితర 25కు పైగా క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు బేసిక్స్ నుంచి ఉత్తమ శిక్షణ అందించాలనే ఉద్దేశంతో నిపుణులైన కోచ్‌లను ప్రత్యేకంగా నియమించామని తెలిపారు. ఉ దయం, సాయంత్రం రెండు విడతల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ ఏడాది కొత్తగా స్విమ్మింగ్ పూల్‌తోపాటు మరికొన్ని క్రీడా మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. శిక్షణకు అవసరమైన ఫిట్‌నెస్ పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈనెల 29 నుంచి మూడు వారాలపాటు నిర్వహించనున్న శిక్షణకు రూ.2999 చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తిగల వారు ఫోన్:88866 67878ను సంప్రదించి ఎంట్రీలు పొందాలన్నారు.

చప్పగా జగన్ రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

వున్నవారికి నమస్కరిస్తూ వెళ్లారు. మధ్యాహ్నం 1.20 గంటలకు గోపాలపట్నం పెట్రోల్‌బంక్ వద్ద భోజన విరామం తీసుకున్నారు. తిరిగి 3.45 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా కరాస, మర్రిపాలెం, కంచరపాలెం మెట్టు, దొండపర్తి, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, హనుమంతవాక జంక్షన్ మీదుగా పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీకి చేరుకుని రాత్రి బస చేశారు.

ఈ సందర్భంగా బస్సు యాత్ర సాగిన మార్గంలో పలుచోట్ల జనాలు కనిపించకపోవడం వైసీపీ వర్గాలు నిరుత్సాహానికి గురయ్యాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, అక్కయ్యపాలెం, ఇసుకతోట వంటిచోట్ల ఒక మాదిరిగా జనాలు ఉన్నప్పటికీ...వారంతా ఆయా నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు ఆటోలు పెట్టి తీసుకువచ్చినవారే కావడం విశేషం. ఇందుకుగాను పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున ఇచ్చారు. తూర్పు నియోజకవర్గంలో అయితే రోడ్‌షోకు వచ్చిన వారందరికీ కూపన్‌లు ఇచ్చి కార్యక్రమం పూర్తయిన తర్వాత వచ్చి రూ.500 తీసుకోవాలని సూచించారు. కొన్నిచోట్ల రోడ్‌షో అయిపోయిన వెంటనే వైసీపీ టోపీ, టీషర్టు ధరించిన వ్యక్తులు సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి మద్యం కొనుగోలు చేసుకోవడం కనిపించింది. జగన్ రోడ్‌షో సందర్భంగా నగరంలో చాలాప్రాంతాల్లో ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అలాగే జగన్ బస్సు రావడానికి గంట ముందు నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రసంగం లేకుండా అభివాదాలతోనే ముగిసిన రోడ్‌షో

సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షోను ప్రసంగం లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. పెందుర్తి నియోజకవర్గంలో మొదలైన ఆయన బస్సు యాత్ర విశాఖ పశ్చిమ, ఉత్తరం, దక్షిణం, తూర్పు నియోజకవర్గాల మీదుగా భీమిలి నియోజకవర్గంలో ముగిసింది. అయితే సీఎం జగన్ కొన్నిచోట్ల బస్సుపై నిలబడి, మరికొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు అభివాదం/నమస్కారం చేశారు తప్ప ఎక్కడ ఉపన్యసించలేదు. రెండు, మూడుచోట్ల బస్సు ఆపి వివిధ వర్గాలకు చెందినవారి నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. కానీ ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

నగర వాసులకు నరకం

... 5వ పేజీ తరువాయి

పోలీసులపై తిరగబడడంతో వాహనాలను విడిచిపెట్టారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభం కాకముందే బాజీ జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులోకి వాహనాలను రానివ్వకుండా పోలీసులు నిలిపివేశారు. ఎంతసేపటికీ జగన్ బస్సు రాకపోవడంతో వాహనచోదకులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినప్పటికీ పోలీసులు మాత్రం సీఎం జగన్ బస్సు వెళ్లిన తర్వాతే వాహనాలను విడిచిపెట్టారు. అలాగే రైల్వే న్యూకాలనీ మీదుగా అక్కయ్యపాలెం జాతీయ రహదారిపైకి సీఎం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చేరుకున్నారు. అయితే సాయంత్రం ఆరు గంటల నుంచే పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో జాతీయరహదారిపై వందలాది వాహనాలు బారులు తీరిపోయాయి. అయితే పోలీస్ ఉన్నతాధికారులు కల్పించుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సీఎం జగన్ బస్సు యాత్ర మహరాణిపార్లర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపివేయించారు. జగన్ రోడ్‌షో నేపథ్యంలో బస్సు యాత్ర జరిగే మార్గంలో ఆదివారం ఉదయం నుంచే దుకాణాలను మూసివేయించడంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం జగన్ భద్రత పేరుతో రోడ్‌షో జరిగే మార్గంలో భవనాలపై నుంచి చూసేవారిని పోలీసులు వెళ్లి కిందకు దింపివేయించడం కనిపించింది. జగన్ రోడ్‌షో కోసం వైసీపీ నేతలు భారీగా జన సమీకరణకు వ్యూహం రచించారు. అందుకోసం మహిళలకు రూ.200, పురుషులకు రూ.300 చొప్పున ఇస్తామని చెప్పినప్పటికీ పెద్దగా స్పందన కనిపించలేదు. ఆటోల్లో తరలించినప్పటికీ గంటల తరబడి వేచి ఉండలేక కొంతమంది తమ పేర్లను నమోదుచేసుకున్న తర్వాత, మరికొందరు తమ పేర్లను నమోదుచేయించుకోకుండానే వెనుతిరిగి వెళ్లిపోవడం వైసీపీ నేతలను ఆశ్చర్యానికి గురిచేసింది.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారులను అభినందిస్తున్న వీవీ లక్ష్మీనారాయణ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: కళాకారులను ప్రోత్సహించడం ఎంతైనా అవసరమని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ దక్షిణ వేదికలో నాదయోగ వైజాగ్ చాప్టర్ భావరాగలహరి బ్యానర్‌లో నాదం మా జీవం సంగీత విభావరి నిర్వహించారు. బ్యానర్ వ్యవస్థాపకురాలు నాగవర్ధిని మాట్లాడుతూ కళలపై ఉన్న మక్కువ తమను హైదరాబాద్ నుంచి విశాఖకు రప్పించిందన్నారు. తొలి కార్యక్రమాన్ని నిర్వహించిన నేపథ్యంలో పలువురు కళాకారులను సత్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపతి, ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, రమేశ్ యబలూరి, స్వాతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు అమ్మేసుకుంది'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లను అమ్మేసుకుందని ఆ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు హైదర్ ఆలీసింకా ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక్క ముస్లింకి కూడా టికెట్ కేటాయించలేదన్నారు.కాంగ్రెస్‌కు ముస్లిం ఓటు బ్యాంకు పుంజుకోవాలంటే ముస్లింలకు టిక్కెట్లు ఇవ్వాలన్నారు. మిగిలిన పార్టీలకు తమకు మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని పేరు తెలియని వ్యక్తి టికెట్ ఇవ్వడం దారుణమన్నారు. గత ఏళ్ల 40గా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నామన్నారు.మరోసారి పార్టీ పెద్దలు ఆలోచించి టికెట్లను కేటాయించాల్సి ఉందన్నారు. దక్షిణ టికెట్ మార్చకుంటే ఇండిపెండెంట్స్‌గా పోటీ చేసి తమ సత్తా చాటుతామన్నారు.ఈ సమావేశంలో మహబూబ్ షరీఫ్, షేక్ షాను, షరీఫ్, బుకారి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో యువకుడి హత్యపై న్యాయపోరాటం



మాట్లాడుతున్న అచ్యుతరావు

మహారాణిపేట, ఏప్రిల్ 21: ఆరిలోవకు ఇటీవల హత్యకుగురైన యువకుడు అమర్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవటం అన్యాయమని ఉపకార చారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ,తమ ఉపకారచారిటబుల్ సభ్యుడైన అమర్‌ను అతి దారుణంగా హత్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై ఆయన కుటుంబ సభ్యులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నా, పోలీసులు కావాలనే కేసు నీరుగార్చుతున్నారన్నారు. హత్య జరిగి తొమ్మిదిరోజులైనా పూర్తిస్థాయిలో నిందితుల అరెస్టులు జరగలేదని పేర్కొన్నారు. అమర్ హత్యకు డబ్బు లావాదేవీ, ఇరువర్గాల మధ్య గొడవలు ఉన్నాయని తెలిపారు. ఈఘటనపై కలెక్టర్, పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. న్యాయం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామన్నారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అమర్ కటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆత్మీయ సమావేశం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21: గ్రేటర్ 26వ వార్డులో బీజేపీ జాతీయ నాయకుడు మాదేటి కనకారావు ఆ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలంటే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగడమూడి నానాజీ, వార్డు అధ్య క్షుడు కేవీ కుమార్, అరుణ్, ప్రతాప్, బొడ్డేటి మోహన్, బొడ్డేటి రవికుమార్, కాళ్ల శ్రీనివాస్, సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరి మహిళలతో వంశీకృష్ణ



36వ వార్డులో ప్రచారంలో యువతతో..

ఎన్డీఏ కూటమితోనే విశాఖ అభివృద్ధి

» 'దక్షిణ' జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూటమి, ఏప్రిల్ 21: ఎన్డీఏ కూటమికి అధికారంతోనే విశాఖ నగర అభివృద్ధి సాధ్యమని దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 36 వ వార్డు రంగిరీజువీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి తరపున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. వన్‌టౌన్‌లోని యువకుల కు ఉపాధి కల్పిస్తామన్నారు. రంగిరీజువీధి, 37వ వార్డు పెయిన్‌దొరపేట ప్రాంతాల్లో వసతులు కల్పనకు కృషి చేస్తానన్నారు. అధికార వైసీపీ నాయకుల మాయమాటలకు మోసపోవద్దన్నారు. సీనియర్ నేత కొప్పుల వెంకటరావు తదితరులు 36, 37వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి కోరారు. టీడీపీ నేత కేదారి లక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు జనసేనలో చేరిక

మహారాణిపేట: కూటమి అభ్యర్థులను గెలుపునకు కృషి చేస్తామని మహిళలు అన్నారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం కృష్ణా గార్డెన్స్ వద్ద జనసేన పార్టీ కార్యాలయంలో రాజుగౌడ్ ఆధ్వర్యంలో 39వ వార్డుతో పాటు పలు ప్రాంతాలకుచెందిన మహిళలు జనసేన పార్టీలో చేరారు. వంశీకృష్ణ శ్రీనివాస్ వారిని కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు కార్యక్రమంలో జంగాలమ్మ, మసేనమ్మ, జయ వెంకటలక్ష్మి, పారు దేవి, వార్డు అధ్యక్షుడు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ మహిళా ద్రోహి

» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంత లక్ష్మి

మహారాణిపేట, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళాద్రోహి అని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఎస్. అనంతలక్ష్మి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్.. నా అక్కాచెల్లెమ్మలు అంటూ మాయమాటలతో మహిళలను మోసగించి చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. నాసిరకం మద్యం సరఫరా చేస్తు మహిళల తాళిబొట్లు తెంచుతున్నారన్నారు. తన సొంత తల్లి, చెల్లిని బయటకు పంపించిన జగన్ రాష్ట్రం లోని మహిళలకు ఏం చేస్తారని ఆమె ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సోదరి సునీత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని అన్నా రు. గులకరాయి తగిలితే బోరున ఏడ్చిన వైసీపీనేత శ్రీరెడ్డి.. మహిళల తాళి బొట్లు తెగితే ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి గనగళ్ల సత్యవతి మాట్లాడుతూ జగన్ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పో యాయని అన్నారు. జగన్ మహిళా ద్రోహి అయినందునే సొంత చెల్లెలు త న అన్నకు ఓటు వేయవద్దని చెబుతున్నారన్నారు. మహిళలు మే లుకున్నారని, ఈఎన్నికలలో జగన్‌కు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

మహోన్నతమైనది భారతీయ సంస్కృతి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: భారతదేశ సంస్కృతి మహోన్నతమైనదని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ ఐఈబీలో స్వామి గుణేశానంద శ్రీ రామకృష్ణమిషన్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో బీవీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణమిషన్ స్వామిజీ గుణేశానంద జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ భారతీయులుగా జన్మించడం పూర్వజన్మసుకృతమన్నారు. దేశం సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. బీవీపీ ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు సభాధ్యక్షత వహించగా పలు శాఖల కార్యవర్గ సభ్యులుప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రాజన్ వలయ్హాన్, రమేష్‌చంద్‌జైన్, పురుషోత్తమశాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.ఎస్.ఎల్. శైలజ, ఆంజనేయప్రసాద్, పి.నిర్మల, పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీవీపీ కార్యదర్శి జీబీవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

మురళీనగర్, ఏప్రిల్ 21 ; కాంగ్రెస్ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయాన్ని మురళీనగర్‌లో ఆరంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన విధంగా ఏపీలోనూ పూర్వ వైభవం సాధించే దిశగా తాను విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ నాయకులు, విశాఖ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎండలో నిరీక్షణ.. ట్రాఫిక్ కష్టాలు

» 'సీఎం షో'లో జనం పాట్లు ... ఇళ్లకు వెళ్లిపోతున్న వారి అడ్డగింత

అక్కయ్యపాలెం/ కంచరపాలెం, ఏప్రిల్ 21 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రోడ్డు షోతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలనుంచి ఆదివారం సాయంత్రం 4 గంటలకు వచ్చిన మహిళలు అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ ఎనభై అడుగుల రోడ్డు, నాలుగు లైన్ల రహదారి జంక్షన్, పోర్టు స్టేడియం వద్ద గంటల కొద్దీ నిరీక్షించారు. ఎంతకీ సీఎం రాకపోవడంతో విసుగు చెంది వెళ్లిపోవడానికి సిద్ధమైన పలువురిని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వీరిలో కొంతమంది చాటుగా వెళ్లిపోవడం కనిపించింది. రోడ్డు షోకు తీసుకు వచ్చిన తమకు కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వలేదంటూ పలువురు మండిపడ్డారు. ఎట్టకేలకు సీఎం జగన్ రాత్రి 7 గంటలకు మహారాణి పార్లర్ వద్దకు వచ్చారు. 7-45 గంటలకు నాలుగు లేన్ల రహదారి వద్దకు వచ్చి కాన్వాయ్ ఎక్కి అభివాదం చేసి వెళ్లిపోయారు. దీంతో తాము గంటల కొద్దీ రోడ్డుపైనే వేచి ఉన్నామని, కనీసం ప్రసంగించకుండా వెళ్లిపోయారని పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. కంచరపాలెం ప్రధాన రోడ్డులో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6వరకు రోడ్డుపైనేమహిళలను నిల్చోపెట్టారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతతో అవస్థలు

ముఖ్యమంత్రి జగన్ వస్తున్నారంటూ అక్కయ్యపాలెం పరిసరాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉష్ణోగ్ర త అధికంగా ఉండడంతో ఇళ్లలోని జనాలు కరెంట్‌లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కానీ, నిర్వహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఆ శాఖ సిబ్బంది చెప్పడం గమనార్హం.



కంచరపాలెం రోడ్డు డివైడర్‌పై ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

బైక్ ర్యాలీతో ట్రాఫిక్‌కు అంతరాయం

వైసీపీ నాయకులు బైక్ ర్యాలీతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. బైకులను నాలుగు లేన్ల రహదారిపైనే నిలిపివేయడంతో సిటీ బస్సులు, కార్లు, ఇతర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



బైక్ రాలీలో ఇరుక్కున్న సిటీ బస్సు



నాలుగులేన్ల రహదారిపై..

మహిళలకు ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్

సీతంపేట, ఏప్రిల్ 21: మహిళలకు మే 10వ తేదీ నుంచి పీవీజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్ నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నుంచి 30 ఏళ్ల లోపు బాలికలు, మహిళలకు ఈ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ తరగతులను బీచ్‌రోడ్డులో వైఎంసీఏ ఎదురుగా బీచ్ వద్ద, గోపాలపట్నం ఉన్నత పాఠశాల, భీమిలిలో వారం పాటు జరుగుతాయన్నారు. పీఎస్ఆర్ అకాడమీఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి పి.నరసింహారావు, శివరామకృష్ణ, చైతన్య డాక్టర్ సతీష్ కొల్లి, ప్రొఫెసర్ వి.పూజారి, కేకే రాజు, ప్రవీణ్. జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 21: గొల్లలపాలెం పాత జైల్ రోడ్డు వద్ద శెట్టి బలిజ సం ఘం ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శ్రీ కోదండ సీతారామాంజనేయ ఆలయంలో శ్రీరామనవమిఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం మహా అన్న ప్రసాద వితరణ చేపట్టారు.ఆలయ కమిటీ నాయకులు బడితమాని ఈశ్వరరావు, సమంగి కోటేశ్వరరావు, రంగాల శ్రీనివాస వర ప్రసాద్, కోస్టు శ్రీను పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 21: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సంత్రాగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రాగచ్చి

08845 నంబరు గల రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు దువ్వాడ, ఆదివారం ఉదయం తెల్లవారు జాము 2.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 3.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 8.55కు దువ్వాడ, సోమవారం ఉదయం 10.48 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది.

కొయంబత్తూరు-బరౌని-కొయంబత్తూరు

06059 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 3.45కు కొయంబత్తూరు చేరుతుంది.



గరుడ, గజ వాహనాలపై శ్రీవారు

గరుడ, గజ వాహనాలపై ఊరేగిన వేంకటేశ్వరుడు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 21: జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు చేశాక స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి హోమాలు జరిపారు. అనంతరం గరుడ వాహనంపై శ్రీవారిని ఆశీనులను చేసి ఊరేగించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం గజ వాహనంపై వేంకటేశ్వరస్వామిని ఉంచి పురవీధులలో పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. పలువురు మహిళలు అన్నమాచార్యుని భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'శ్రీభరత్, పల్లా నామినేషన్ కార్యక్రమాలను సక్సెస్ చేయాలి'

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 21: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుల విజయం విశాఖ అభివృద్ధికి ఎంతో అవసరమని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం శ్రీభరత్, 24న పల్లా శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేయనున్న కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాసు, శివప్రసాద్, వి.కొండబాబు, ఎన్.సింహాద్రి, ఎస్.జగన్, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచేవి పుస్తకాలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 21: విజ్ఞానాన్ని పెంచేవి పుస్తకాలు అని, అందువల్ల విద్యార్థులందరూ తప్పనిసరిగా పుస్తకాలు చదివే అలవాటును పెంచుకోవాలని శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ సూచించారు. ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పుస్తకాలను క్రమం తప్పకుండా చదవడం వల్ల విజ్ఞానం పెరగడమే కాకుండా ఉన్నత చదువులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు మోడల్ యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు హౌస్ అరెస్టు



గృహనిర్బంధంలో రతన్‌కాంత్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21: సీఎం జగన్ పర్యటనకు వచ్చినప్పుడల్లా ప్రత్యర్థి పార్టీలకు చెందిన నాయకులను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని టీఎన్ఎస్ఎఫ్ విశాఖ పార్లమెంటు నాయకుడు రతన్ కాంత్ విమర్శించారు. నగరంలో ఆదివారం జగన్ బస్సు యాత్రలో పాల్గొన్న నేపథ్యంలో ముందస్తుగా రతన్ కాంత్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లకుండా తమను అడ్డుకుని వైసీపీ ప్రభుత్వం ఏం సాధిస్తుందని ప్రశ్నించారు.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం:** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్:** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది:** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్:** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్:** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్:** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్:** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి:** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 22, క్యారెట్ 36, దొండకాయలు 30, బంగాళదుంపలు 25, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, ఆగాకర 72, పొటల్స్ 70, కీర దోస 24, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 11లో

బాబోయ్ హై టెన్షన్ విద్యుత్ వైర్లు

జనావాసాల మీదగా ఉన్న వైర్లతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న 71, 72 వార్డుల ప్రజలు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు



71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో జనావాసాల మీదగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 21: జనావాసాల మీదగా ఉన్న హై టెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ వైర్లు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ హెచ్‌టీ వైర్ల మూలంగా కుటుంబ సభ్యులతో కాసేపు డాబాపై సరదాగా గడుపుమన్నా బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో 71వ వార్డు సుందరయ్య కాలనీలో కేబుల్ కనెక్షన్ ఇస్తుండగా హెచ్‌టీ వైర్లు తగలడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎడమ చేయి, ఛాతీ భాగం కాలిపోయింది. అంతేకాక పెద్ద శబ్దం రావడంతో సమీపంలోని నాలుగు ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు, వైరింగ్, ఫ్యాన్లు, టీవీలు, కాలిపోయాయి. హెచ్‌టీ విద్యుత్ లైన్ల మూలంగా ఓ వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా ఇక్కడి అఫీషియల్ కాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనుగు జరుగుతుండగా నీరు హెచ్‌టీ విద్యుత్ లైన్లపై పడడంతో పెద్ద పేలుడు సంభవించి మంటలు కూడా ఎగసిపడ్డాయి.

71, 72 వార్డులలో..

జీవీఎంసీ 71, 72 వార్డుల్లో హెచ్‌టీ లైన్ల తొలగింపు బాధ్యత చేతుల్లో లేదని ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఇక్కడి పరిస్థితులను పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించామని వారంటున్నారు. శ్రీనగర్, పాతకర్ణవానిపాలెం, కుంచుమాంబ కాలనీ, ఎర్రగడ్డ కాలనీ, చినగంట్యాడ, అఫీషియల్ కాలనీ, శ్రీరామ్ నగర్, సుందరయ్య కాలనీ, దుర్గా నగర్, అరుణోదయ కాలనీ వాసులకు హెట్ వైర్లు శాపంగా మారాయి. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని హెచ్‌టీ వైర్లను తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

హెచ్‌టీ వైర్లను మార్చాలి

-పి.రాజారావు, శ్రీరామ్‌నగర్



దశాబ్దాల కాలం నుంచి విద్యుత్ హైటెన్షన్ వైర్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పైనుంచి తమకు ఆదేశాలు రావాలంటున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు. మృత్యుపాశాలుగా మారిన హైటెన్షన్ వైర్లు జనావాసాస మీదుగా ఉండకుండా మార్చాలి.

ప్రజలకు రక్షణ కల్పించాలి

-జి.సూర్యనారాయణ, శ్రీనగర్



ప్రమాదాలకు సంకేతాలుగా మారిన హెచ్‌టీ వైర్ల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి. హెచ్‌టీ వైర్ల మూలంగా గతంలో ఓ బాలుడు మృతి చెందాడు. పలువురు ప్రమాదాలకు గురై అవయవాలు కోల్పోయారు. ఎప్పటికప్పుడు ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమవుతున్నాయి. అందువల్ల అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.





పినగాడి కూడలిలో పోలీసుల భద్రతా వలయంలో సాగుతున్న జగన్ బస్సు యాత్ర... పక్కన ద్విచక్ర వాహనదారున్ని నిలువరిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

జగన్ బస్సు యాత్ర.. జనానికి నరకయాతన

ఎక్కడికక్కడ రోడ్లపై రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనచోదకులు

ఎండ వేడిమికి తాళలేక గగ్గోలు

పెందుర్తి, ఏప్రిల్ 21: సీఎం జగన్ సిద్ధం బస్సు యాత్ర వాహనచోదకులకు నరకం చూపించింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీఎం బస్సు యాత్ర కోసం పినగాడి, వేపగుంట రహదారిలో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. దీంతో వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. మండుటెండలో సుమారు గంటపాటు వాహనచోదకులు నరకయాతనకు గురయ్యారు. పినగాడి నుంచి పెందుర్తి మీదగా విశాఖ, విజయనగరం ఇతర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ పద్మవ్యూహంలో చిక్కుకుపోవడంతో వాటిలో ఉన్న ప్రయాణికులు భరించరాని ఉక్కపోతతో గగ్గోలు పెట్టారు. బస్సు యాత్ర సుమారు రెండు గంటలు ఆలస్యంగా మొదలవ్వడంతో వైసీపీ నేతలు సమీకరించిన జనాల్లో కొంతమంది ఎండకు తాళలేక ఇళ్లకు వెళ్లిపోవడం కనిపించింది. అదేవిధంగా జగన్ పర్యటన పుణ్యమాని ఈ మార్గంలోని తమ దుకాణాలను మూయించారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



గోపాలపట్నం ప్రధాన రహదారిలో బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

గోపాలపట్నంలో స్తంభించిన ట్రాఫిక్

గోపాలపట్నం: జగన్ బస్సు యాత్ర ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు గోపాలపట్నం చేరింది. ఇక్కడి బంక్ కూడలిలోని బుధవారం సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో భోజన విరామం కోసం జగన్ కాసేపు సేదతీరారు. అనంతరం 3.45 గంటలకు బస్సు యాత్రను ప్రారంభించారు. అయితే బస్సుయాత్ర నేపథ్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డులోని రెండు రహదారుల్లో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు.

కేవలం ఒక సర్వీసు రోడ్డులోనే వాహనాలు రాకపోకలు సాగించడంతో వాహనదారులు నానాపాట్లు పడ్డారు. బస్సు యాత్ర ఎన్‌ఏడీ జంక్షన్‌కు చేరేంత వరకు ఎన్‌ఏడీ-గోపాలపట్నం జంక్షన్‌ల మధ్య ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. జగన్ బస్సు యాత్ర వల్ల రెండు రహదారులను మూసివేయడం దారుణమని, దీనివల్ల తాము నానాపాట్లు పడాల్సి వచ్చిందని పలువురు వాహనదారులు వాపోయారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే..

టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



65వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

పెదగంట్యాడ, ఏప్రిల్ 21: ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వం త్వరలో అధికారంలోకి రానున్నదని టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 65వ వార్డులో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అనకాపల్లి వాసులు వద్దన్న గుడ్డు మంత్రిని ఇక్కడ పోటీలో నిలిపారని, గాజువాక ప్రజలకు ఏనాడూ అందుబాటులో లేని అమర్‌నాథ్‌కు ప్రజలను ఓటు అడిగే అర్హత లేదన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాజువాకను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. గంగవరం పోర్టు, ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యతను తాను తీసుకుంటానని పల్లా పేర్కొన్నారు. దాడులకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, తిప్పల రమణారెడ్డి, సూర్యారావు, తిరుపతిరావు, సత్యనారాయణ, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ దుర్గాదేవి సన్నిధిలో పూజలు

గాజువాక: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేతుల మీదగా బీఫారం అందుకున్న గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయవాడలోని కనకదుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో కూటమి అభ్యర్థులందరూ విజయం సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లూరు సూర్యనారాయణ, గోమాడ వాసు, సింగూరు అనంత్, బుల్లెట్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెందుర్తి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 21: రానున్న ఎన్నికల్లో అవినీతి వైసీపీని సాగనంపి కూటమి విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పనిచేయాలని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. అమృత పురం సమీపంలో ఆదివారం బూతు కన్వీనర్లు, వార్డు కన్వీనర్లు, ముఖ్యకార్యకర్తలకు పోల్ మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆలీబాబా నలభై దొంగల్లా వైసీపీ రాష్ట్రాన్ని దోచుకుందని, అటువంటి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా చంద్రబాబు వలనే సాధ్యమన్నారు. తన గుర్తు గాజు గ్లాసు, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా పెదయాతపాలెంకు చెందిన శరగడం రాము ఆధ్వర్యంలో 60 మంది, వంగలి, వెదుళ్లనవరకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. వారందరికీ పంచకర్ల రమేశ్‌బాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, ఇందలి రమణ, ఎం. మహలక్ష్మీనాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు, గండి ముత్యాలనాయుడు, బీపీ రావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ, బోకం స్వామినాయుడు, పల్ల తాతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

పరవాడ: కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, పి.బోనంగి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు, గ్రామస్థులు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, మాజీ సర్పంచులు అట్టా సన్యాసిఅప్పారావు, గొర్లి కనకారావు, రాయవరపు దేముడు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

అగనంపూడి, ఏప్రిల్ 21: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడకలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన వార్డు శ్రేణి నాయకులు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను గురించి తెలియజేయడంతో పాటు వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకుఉలు గవర సోమశేఖర్, ఎ.మంగరాజు, కె.రమణ, బోయన్న, శ్రీదేవి, భాస్కర్, శ్రీను, సాయి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యోగుల వేళలు..

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21: స్టీల్ ప్లాంట్‌లో ఏ-షిఫ్ట్ విధులకు హాజరయ్యే ఉద్యోగుల కోసం ఉదయం 5 నుంచి 6, జనరల్ షిఫ్ట్ వారి కోసం 8 నుంచి 9, బీ-షిఫ్ట్ కోసం ఒంటిగంట నుంచి రెండు, సీ-షిఫ్ట్ ఉద్యోగుల కోసం రాత్రి 9 నుంచి 10 గంటల వరకు ప్లాంట్‌లోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు. అదేవిధంగా విధులు ముగించుకుని తిరిగి వచ్చే వారి కోసం సీ-షిఫ్ట్ వారి కోసం ఉదయం 6.30 నుంచి 7.30, ఏ-షిఫ్ట్ వారి కోసం 2.30 నుంచి 3.30, జనరల్ షిఫ్ట్ వారి కోసం 5.30 నుంచి 6.30, బీ-షిఫ్ట్ నుంచి వచ్చే ఉద్యోగుల కోసం రాత్రి 10.30 నుంచి 11 గంటల వరకు ప్లాంట్ బయటకు వచ్చేందుకు అనుమతిస్తారు.

కాంగ్రెస్, సీపీఎం ప్రచారం

పెదగంట్యాడ, ఏప్రిల్ 21: జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం, పల్లిపాలెం, జాలరి పల్లిపాలెం ప్రాంతాల్లో కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కాంగ్రెస్, సీపీఎం ఉమ్మడి ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, గాజువాక అభ్యర్థి జగ్గునాయుడులను గెలిపించాలని కోరారు. నాయకులు కొవిరి దేవుడు, సోమేశ్, మసేన్, తదితరులు పాల్గొన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు

మహా గర్జన కార్యక్రమం విజయవంతం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 21: త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని, ఉక్కు పరిరక్షణే తమ ధ్యేయమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరం వద్ద ఆదివారం నిర్వహించిన మహా గర్జన కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల వేళ విశాఖ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు మహాగర్జనను నిర్వహించామన్నారు. ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు కార్మికులు వినూత్న పంథాలో ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు పోరాటంలో కార్మికుల సంకల్పం గొప్పదన్నారు. ఎంతోమంది త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ఉద్యమాలతో కార్మికులు పరిరక్షించుకుంటారన్నారు. ప్రజా, కార్మిక ఉద్యమాల ద్వారా ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయవచ్చన్నారు. మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ మట్లాడుతూ ప్రజల ఆత్మ గౌరవమైన విశాఖ ఉక్కును కాపాడుకోవటమే ప్రస్తుతం మనందరి కర్తవ్యమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, కేఎస్ఎన్ రావు, పరంధామయ్య, గంగవరం గోపి, వి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



పినగాడి రోడ్డులో ప్యాచ్ వర్క్‌లు చేసి.. కొన్నిచోట్ల ఇలా వదిలేసి..

సీఎం సార్ వచ్చారని..

వేపగుంట నుంచి పినగాడి వరకు ఉన్న రోడ్డులో అక్కడక్కడ ప్యాచ్ వర్కులు

పూర్తి స్థాయిలో పూడ్చకపోవడంపై విమర్శలు

పెందుర్తి, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొనేందుకు రావడంతో వేపగుంట నుంచి పినగాడి వరకు అధ్వానంగా ఉన్న రోడ్డులో కొన్నిచోట్ల ప్యాచ్ వర్క్‌లు చేసి గోతులను పూడ్చివేశారు. సీఎం ప్రయాణించే మార్గంలో కొన్ని గోతులను మాత్రమే తారు, కంకర వేసి పూడ్చివేశారు. మిగతాచోట్ల పెద్దపెద్ద గోతులు ఉన్నా వాటి గురించి పట్టించుకోలేదు. సీఎం మెప్పు పొందేందుకు అధికార పార్టీ నాయకులే హడావిడిగా ఈ పనులు చేపట్టినట్టు తెలిసింది. అయితే ఈ రోడ్డులోని గోతులను పూర్తి స్థాయిలో పూడ్చకపోవడం దారుణమని పలువురు వాహనదారులు విమర్శిస్తున్నారు. వేపగుంట నుంచి పినగాడి వరకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం గల ఈ రోడ్డంతా పెద్దపెద్ద గోతులతో నిండి ఉంటుందని, దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారి

భానుడు భగభగ.. రోడ్లు వెలవెల

ఎండ వేడిమికి తాళలేక సాయంత్రం వరకు షాపులను మూసివేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 21: భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిలలాడిపోయారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సూరీడు ప్రతాపం చూపడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకే హడలెత్తిపోయారు. ఇదే పరిస్థితి స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకుంది. నిత్యం జనంతో కళకళలాడే పాత గాజువాక జంక్షన్, పంతులు గారి మేడ, చినగంట్యాడ కూడలి, స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గాలు బోసిపోయాయి. ఏదైనా అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. పాత గాజువాక నుంచి కొత్తగాజువాక వరకు గల ఫుట్‌పాత్ వ్యాపారులు ఎండ వేడిమికి తాళలేక సాయంత్రం వరకు షాపులను మూసివేస్తున్నారు. వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో జనం ఎండ వేడిమికి, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పొట్ట కూటి కోసం ఎండలో పనిచేసే రోజువారి కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. చాలామంది భవన నిర్మాణ కార్మికులు ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులకు హాజరవుతున్నారు. కాగా ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు అత్యధికులు శీతలపానీయాల షాపులను ఆశ్రయిస్తుండడంతో వాటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కాగా అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావద్దని, బయటకు వస్తే తప్పనిసరిగా గొడుగు, క్యాపులు, మహిళలు, యువతులు చున్నీలు వంటివి ఎండ తగలకుండా ధరించాలని, ఎక్కువగా నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.



జనకళ తప్పిన రోడ్డు


ప్రచారంలో విష్ణుకుమార్‌రాజు


అక్కయ్యపాలెం వద్ద బైక్ ర్యాలీలో జనసేన నాయకులు, కార్యకర్తలు

వైసీపీ పాలనలో అన్నీ కష్టాలే

» బీజేపీ 'ఉత్తర' అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 : గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రంలోని ప్రజలు త్వరలోనే విముక్తి పొందనున్నారని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎనభై అడుగుల రోడ్డులో భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న విష్ణుకుమార్‌రాజు మాట్లాడు తూ వైసీపీ పాలనలో నిత్యావసరాల ధరలతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలను పెంచి సామాన్యుని నడ్డి విరిచేశారని మండిపడ్డారు. ఈస్థితిలో ఎన్నికల్లో సుపరిపాలన అందించనున్న బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు జనసైనికులంతా సిద్ధం గా ఉన్నారన్నారు. ఆ పార్టీ సీనియర్ నేత సంకు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి శ్రేణుల మధ్య విభేదాలున్నట్లు పలు పార్టీలు ఆరోపిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

యువతకు రూ. 500!

» సీఎం పర్యటన పురస్కరించుకుని ప్రలోభాలు?


వాహనదారుల పేర్లు నమోదు చేస్తున్న వైసీపీ కార్యకర్త

సీతమ్మధార, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రచార యాత్రలో భాగంగా ఉత్తర, తూర్పు నియోజకవర్గాల్లో యువతకు నగదు పంపిణీ చేసినట్టు సమాచారం. యువతను ఆకట్టుకోవడానికి వీలుగా వారి పేర్లు రాసుకొని ఒక్కో బైక్‌కు రూ.500 చొప్పున వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్టు ఆరోపణలున్నాయి.

9 మందితో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ, అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులను ఆదివారం ఏఐసీసీ ప్రకటించింది. శ్రీకాకుళం నుంచి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం-బొబ్బిలి శ్రీను, అమలాపురం(ఎస్సీ) - జంగా గౌతమ్, మచిలీపట్నం- గొల్లు కృష్ణ, విజయవాడ- వల్లూరు భార్గవ్, ఒంగోలు- ఈద సుధాకర్ రెడ్డి, నంద్యాల- జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, అనంతపురం- మల్లికార్జున వజ్జల, హిందుపూర్ నుంచి బీఏ సమద్ షహీన్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన చేశారు.

'వాసుపల్లి'ని ఓడించండి'

జగదాంబ కూడలి, ఏప్రిల్ 21: అవినీతికి నిర్వచనంగా నిలుస్తున్న వైసీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌ను ఓడించాలని మాజీ కార్పొరేటర్, తెలుగు మహిళా నాయకురాలు పోలిపిల్లి జ్యోతి అన్నారు. ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక 30వ వార్డులో ఇంటింటికీ ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు అన్ని విధాలుగా దగా చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరుచెప్పి మహిళల కుటుంబాలను వంచిస్తున్న జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. దక్షిణంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ గాజు గ్లాసుకు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. తాడివీధి, ఏనుగులవీధి, వార్డుబాయిస్ లైను ప్రాంతాల్లో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ హెచ్‌ఈసీ గ్రూప్‌లో బీవీకే విద్యార్థి ప్రతిభ

సీతంపేట, ఏప్రిల్ 21: భారతీయ విద్యా కేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థి ఆరుద్ర మయూఖ్ భాగవతుల ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ గ్రూపు ఫలితాలలో మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో 929 మార్కులు సాధించి కళాశాలలోని అన్ని గ్రూపుల్లో ప్రథముడిగా నిలిచాడు. ఈ సందర్భంగాప్రిన్సిపాల్ రమా అచంట, ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు రత్నశేఖర్, భరత్ ప్రియా పట్నాయక్ తదితరులు ఆరుద్ర మయూఖ్‌ను అభినందించారు. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తన తల్లిదండ్రుల ప్రోత్సహంతో ఈ విజయం సాధించినట్టు ఆరు ద్ర తెలిపారు. ఐఏఎస్ అధికారి కావడమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు.

'బ్రాహ్మణులను గుర్తించిన పార్టీకే మద్దతు'

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 20: బ్రాహ్మణులను గుర్తించే రాజకీయ పార్టీలకు మాత్రమే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ కె.చరణ్‌కుమార్ సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని రాజకీయ పార్టీలు తమను అసలు గుర్తించలేదని, అలాంటి పార్టీలకు ఈ ఎన్నికల్లో వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. రాజకీయ పార్టీలు ఎప్పుడు ఉత్తరాంధ్ర నుంచి బ్రాహ్మణులు గుర్తించి టిక్కెట్లు ఇచ్చేవారని ఈ సారి గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ నియోజకవర్గంలో ద్రోణంరాజు కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీచేసేవారని, ఈ సారి ఎవరు దురదృష్టకరమన్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు 30వేల మంది బ్రాహ్మణుల ఓటర్లున్నారని కానీ, తమను గుర్తించలేదన్నారు.

క్రీడా పోటీల్లో భాను ప్రకాశ్‌కు పతకాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21 ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన పుప్పాల భాను ప్రకాశ్ మూడు బంగారు పతకాలు సాధించి తన సత్తా చాటారు. భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 5 వరకు నేపాల్‌లోని పోఖరా జిల్లాలోని రంగశాల స్టేడియంలో జరిగిన 9వ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన పుప్పాల భాను ప్రకాశ్ 100, 200, 400 మీటర్ల పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే భాను ప్రకాశ్ సాధించిన విజయానికి విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిశోర్‌కుమార్ తదితరులు అభినందించారు.

29నుంచి పోర్టు స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 21: పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానునట్టు నిర్వాహకులు ప్రమోద్, నరేంద్ర తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, సిలంబం (కర్రసాము), ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, కరాటే, ఖోఖో, కబడ్డీ, స్విమ్మింగ్, స్కేటింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ తదితర 25కు పైగా క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు బేసిక్స్ నుంచి ఉత్తమ శిక్షణ అందించాలనే ఉద్దేశంతో నిపుణులైన కోచ్‌లను ప్రత్యేకంగా నియమించామని తెలిపారు. ఉ దయం, సాయంత్రం రెండు విడతల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ ఏడాది కొత్తగా స్విమ్మింగ్ పూల్‌తోపాటు మరికొన్ని క్రీడా మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. శిక్షణకు అవసరమైన ఫిట్‌నెస్ పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈనెల 29 నుంచి మూడు వారాలపాటు నిర్వహించనున్న శిక్షణకు రూ.2999 చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తిగల వారు ఫోన్:88866 67878ను సంప్రదించి ఎంట్రీలు పొందాలన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారులను అభినందిస్తున్న వీవీ లక్ష్మీనారాయణ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: కళాకారులను ప్రోత్సహించడం ఎంతైనా అవసరమని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ దక్షిణ వేదికలో నాదయోగ వైజాగ్ చాప్టర్ భావరాగలహరి బ్యానర్‌లో నాదం మా జీవం సంగీత విభావరి నిర్వహించారు. బ్యానర్ వ్యవస్థాపకురాలు నాగవర్ధిని మాట్లాడుతూ కళలపై ఉన్న మక్కువ తమను హైదరాబాద్ నుంచి విశాఖకు రప్పించిందన్నారు. తొలి కార్యక్రమాన్ని నిర్వహించిన నేపథ్యంలో పలువురు కళాకారులను సత్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపతి, ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, రమేశ్ యబలూరి, స్వాతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు అమ్మేసుకుంది'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లను అమ్మేసుకుందని ఆ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు హైదర్ ఆలీసింకా ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక్క ముస్లింకి కూడా టికెట్ కేటాయించలేదన్నారు.కాంగ్రెస్‌కు ముస్లిం ఓటు బ్యాంకు పుంజుకోవాలంటే ముస్లింలకు టిక్కెట్లు ఇవ్వాలన్నారు. మిగిలిన పార్టీలకు తమకు మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని పేరు తెలియని వ్యక్తి టికెట్ ఇవ్వడం దారుణమన్నరు. గత ఏళ్లు 40గా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నామన్నారు.మరోసారి పార్టీ పెద్దలు ఆలోచించి టికెట్లను కేటాయించాల్సి ఉందన్నారు. దక్షిణ టికెట్ మార్చకుంటే ఇండిపెండెంట్స్‌గా పోటీ చేసి తమ సత్తా చాటుతామన్నారు.ఈ సమావేశంలో మహబూబ్ షరీఫ్, షేక్ షాను, షరీఫ్, బుకారి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో యువకుడి హత్యపై న్యాయపోరాటం


మాట్లాడుతున్న అచ్యుతరావు

మహారాణిపేట, ఏప్రిల్ 21: ఆరిలోవకు ఇటీవల హత్యకుగురైన యువకుడు అమర్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవటం అన్యాయమని ఉపకార చారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ,తమ ఉపకారచారిటబుల్ సభ్యుడైన అమర్‌ను అతి దారుణంగా హత్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై ఆయన కుటుంబ సభ్యులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నా, పోలీసులు కావాలనే కేసు నీరుగార్చుతున్నారన్నారు. హత్య జరిగి తొమ్మిదిరోజులైనా పూర్తిస్థాయిలో నిందితుల అరెస్టులు జరగలేదని పేర్కొన్నారు. అమర్ హత్యకు డబ్బు లావాదేవీ, ఇరువర్గాల మధ్య గొడవలు ఉన్నాయని తెలిపారు. ఈఘటనపై కలెక్టర్, పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. న్యాయం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామన్నారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అమర్ కటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆత్మీయ సమావేశం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 21: గ్రేటర్ 26వ వార్డులో బీజేపీ జాతీయ నాయకుడు మాదేటి కనకారావు ఆ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలంటే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగడమూడి నానాజీ, వార్డు అధ్య క్షుడు కేవీ కుమార్, అరుణ్, ప్రతాప్, బొడ్డేటి మోహన్, బొడ్డేటి రవికుమార్, కాళ్ల శ్రీనివాస్, సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.


జనసేనలో చేరి మహిళలతో వంశీకృష్ణ


36వ వార్డులో ప్రచారంలో యువతతో..

ఎన్డీఏ కూటమితోనే విశాఖ అభివృద్ధి

» 'దక్షిణ' జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూటమి, ఏప్రిల్ 21: ఎన్డీఏ కూటమికి అధికారంతోనే విశాఖ నగర అభివృద్ధి సాధ్యమని దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 36 వ వార్డు రంగిరీజువీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి తరపున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. వన్‌టౌన్‌లోని యువకుల కు ఉపాధి కల్పిస్తామన్నారు. రంగిరీజువీధి, 37వ వార్డు పెయిన్‌దొరపేట ప్రాంతాల్లో వసతులు కల్పనకు కృషి చేస్తానన్నారు. అధికార వైసీపీ నాయకుల మాయమాటలకు మోసపోవద్దన్నారు. సీనియర్ నేత కొప్పుల వెంకటరావు తదితరులు 36, 37వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి కోరారు. టీడీపీ నేత కేదారి లక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు జనసేనలో చేరిక

మహారాణిపేట: కూటమి అభ్యర్థులను గెలుపునకు కృషి చేస్తామని మహిళలు అన్నారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం కృష్ణా గార్డెన్స్ వద్ద జనసేన పార్టీ కార్యాలయంలో రాజుగౌడ్ ఆధ్వర్యంలో 39వ వార్డుతో పాటు పలు ప్రాంతాలకుచెందిన మహిళలు జనసేన పార్టీలో చేరారు. వంశీకృష్ణ శ్రీనివాస్ వారిని కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు కార్యక్రమంలో జంగాలమ్మ, మసేనమ్మ, జయ వెంకటలక్ష్మి, పారు దేవి, వార్డు అధ్యక్షుడు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ మహిళా ద్రోహి

» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంత లక్ష్మి

మహారాణిపేట, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళాద్రోహి అని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఎస్. అనంతలక్ష్మి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్.. నా అక్కాచెల్లెమ్మలు అంటూ మాయమాటలతో మహిళలను మోసగించి చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. నాసిరకం మద్యం సరఫరా చేస్తు మహిళల తాళిబొట్లు తెంచుతున్నారన్నారు. తన సొంత తల్లి, చెల్లిని బయటకు పంపించిన జగన్ రాష్ట్రం లోని మహిళలకు ఏం చేస్తారని ఆమె ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సోదరి సునీత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని అన్నా రు. గులకరాయి తగిలితే బోరున ఏడ్చిన వైసీపీనేత శ్రీరెడ్డి.. మహిళల తాళి బొట్లు తెగితే ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి గనగళ్ల సత్యవతి మాట్లాడుతూ జగన్ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పో యాయని అన్నారు. జగన్ మహిళా ద్రోహి అయినందునే సొంత చెల్లెలు త న అన్నకు ఓటు వేయవద్దని చెబుతున్నారన్నారు. మహిళలు మే లుకున్నారని, ఈఎన్నికలలో జగన్‌కు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

మహోన్నతమైనది భారతీయ సంస్కృతి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 21: భారతదేశ సంస్కృతి మహోన్నతమైనదని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ ఐఈబీలో స్వామి గుణేశానంద శ్రీ రామకృష్ణమిషన్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో బీవీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణమిషన్ స్వామిజీ గుణేశానంద జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ భారతీయులుగా జన్మించడం పూర్వజన్మసుకృతమన్నారు. దేశం సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. బీవీపీ ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు సబాధ్యక్షత వహించగా పలు శాఖల కార్యవర్గ సభ్యులుప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రాజన్ వలయ్యాన్, రమేష్‌చంద్‌జైన్, పురుషోత్తమశాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.ఎస్.ఎల్. శైలజ, ఆంజనేయప్రసాద్, పి.నిర్మల, పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీవీపీ కార్యదర్శి జీబీవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

మురళీనగర్, ఏప్రిల్ 21 ; కాంగ్రెస్ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయాన్ని మురళీనగర్‌లో ఆరంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన విధంగా ఏపీలోనూ పూర్వ వైభవం సాధించే దిశగా తాను విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ నాయకులు, విశాఖ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎండలో నిరీక్షణ.. ట్రాఫిక్ కష్టాలు

» 'సీఎం షో'లో జనం పాట్లు ... ఇళ్లకు వెళ్లిపోతున్న వారి అడ్డగింత

అక్కయ్యపాలెం/ కంచరపాలెం, ఏప్రిల్ 21 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రోడ్డు షోతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలనుంచి ఆదివారం సాయంత్రం 4 గంటలకు వచ్చిన మహిళలు అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ ఎనభై అడుగుల రోడ్డు, నాలుగు లైన్ల రహదారి జంక్షన్, పోర్టు స్టేడియం వద్ద గంటల కొద్దీ నిరీక్షించారు. ఎంతకీ సీఎం రాకపోవడంతో విసుగు చెంది వెళ్లిపోవడానికి సిద్ధమైన పలువురిని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వీరిలో కొంతమంది చాటుగా వెళ్లిపోవడం కనిపించింది. రోడ్డు షోకు తీసుకు వచ్చిన తమకు కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వలేదంటూ పలువురు మండిపడ్డారు. ఎట్టకేలకు సీఎం జగన్ రాత్రి 7 గంటలకు మహారాణి పార్లర్ వద్దకు వచ్చారు. 7-45 గంటలకు నాలుగు లేన్ల రహదారి వద్దకు వచ్చి కాన్వాయ్ ఎక్కి అభివాదం చేసి వెళ్లిపోయారు. దీంతో తాము గంటల కొద్దీ రోడ్డుపైనే వేచి ఉన్నామని, కనీసం ప్రసంగించకుండా వెళ్లిపోయారని పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. కంచరపాలెం ప్రధాన రోడ్డులో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6వరకు రోడ్డుపైనేమహిళలను నిల్చోపెట్టారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతతో అవస్థలు

ముఖ్యమంత్రి జగన్ వస్తున్నారంటూ అక్కయ్యపాలెం పరిసరాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉష్ణోగ్ర త


బైక్ రాలీలో ఇరుక్కున్న సిటీ బస్సు


కంచరపాలెం రోడ్డు డివైడర్‌పై ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

అధికంగా ఉండడంతో ఇళ్లలోని జనాలు కరెంట్‌లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కానీ, నిర్వహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఆ శాఖ సిబ్బంది చెప్పడం గమనార్హం.

బైక్ ర్యాలీతో ట్రాఫిక్‌కు అంతరాయం

వైసీపీ నాయకులు బైక్ ర్యాలీతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. బైకులను నాలుగు


నాలుగులేన్ల రహదారిపై..

లేన్ల రహదారిపైనే నిలిపివేయడంతో సిటీ బస్సులు, కార్లు, ఇతర వాహనాలు రోడ్డునైనే నిలిచిపోయాయి. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

చప్పగా జగన్ రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

పున్నవారికి నమస్కరిస్తూ వెళ్లారు. మధ్యాహ్నం 1.20 గంటలకు గోపాలపట్నం పెట్రోల్‌బంక్ వద్ద భోజన విరామం తీసుకున్నారు. తిరిగి 3.45 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా కరాస, మర్రిపాలెం, కంచరపాలెం మెట్టు, దొండపర్తి, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, హనుమంతవాక జంక్షన్ మీదుగా పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీకి చేరుకుని రాత్రి బస చేశారు.

ఈ సందర్భంగా బస్సు యాత్ర సాగిన మార్గంలో పలుచోట్ల జనాలు కనిపించకపోవడం వైసీపీ వర్గాలు నిరుత్సాహానికి గురయ్యాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, అక్కయ్యపాలెం, ఇసుకతోట వంటిచోట్ల ఒక మాదిరిగా జనాలు ఉన్నప్పటికీ...వారంతా ఆయా నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు ఆటోలు పెట్టి తీసుకువచ్చినవారే కావడం విశేషం. ఇందుకుగాను పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున ఇచ్చారు. తూర్పు నియోజకవర్గంలో అయితే రోడ్‌షోకు వచ్చిన వారందరికీ కూపన్‌లు ఇచ్చి కార్యక్రమం పూర్తయిన తర్వాత వచ్చి రూ.500 తీసుకోవాలని సూచించారు. కొన్నిచోట్ల రోడ్‌షో అయిపోయిన వెంటనే వైసీపీ టోపీ, టీషర్టు ధరించిన వ్యక్తులు సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి మద్యం కొనుగోలు చేసుకోవడం కనిపించింది. జగన్ రోడ్‌షో సందర్భంగా నగరంలో చాలాప్రాంతాల్లో ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అలాగే జగన్ బస్సు రావడానికి గంట ముందు నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రసంగం లేకుండా అభివాదాలతోనే ముగిసిన రోడ్‌షో

సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షోను ప్రసంగం లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. పెందుర్తి నియోజకవర్గంలో మొదలైన ఆయన బస్సు యాత్ర విశాఖ పశ్చిమ, ఉత్తరం, దక్షిణం, తూర్పు నియోజకవర్గాల మీదుగా భీమిలి నియోజకవర్గంలో ముగిసింది. అయితే సీఎం జగన్ కొన్నిచోట్ల బస్సుపై నిలబడి, మరికొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు అభివాదం/నమస్కారం చేశారు తప్ప ఎక్కడ ఉపన్యసించలేదు. రెండు, మూడుచోట్ల బస్సు ఆపి వివిధ వర్గాలకు చెందినవారి నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. కానీ ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

నగర వాసులకు నరకం

... 5వ పేజీ తరువాయి

పోలీసులపై తిరగబడడంతో వాహనాలను విడిచిపెట్టారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభం కాకముందే బాజీ జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులోకి వాహనాలను రానివ్వకుండా పోలీసులు నిలిపివేశారు. ఎంతసేపటికీ జగన్ బస్సు రాకపోవడంతో వాహనచోదకులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినప్పటికీ పోలీసులు మాత్రం సీఎం జగన్ బస్సు వెళ్లిన తర్వాతే వాహనాలను విడిచిపెట్టారు. అలాగే రైల్వే న్యూకాలనీ మీదుగా అక్కయ్యపాలెం జాతీయ రహదారిపైకి సీఎం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చేరుకున్నారు. అయితే సాయంత్రం ఆరు గంటల నుంచే పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో జాతీయరహదారిపై వందలాది వాహనాలు బారులు తీరిపోయాయి. అయితే పోలీస్ ఉన్నతాధికారులు కల్పించుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సీఎం జగన్ బస్సు యాత్ర మహారాణిపార్లర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపివేయించారు. జగన్ రోడ్‌షో నేపథ్యంలో బస్సు యాత్ర జరిగే మార్గంలో ఆదివారం ఉదయం నుంచే దుకాణాలను మూసివేయించడంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం జగన్ భద్రత పేరుతో రోడ్‌షో జరిగే మార్గంలో భవనాలపై నుంచి చూసేవారిని పోలీసులు వెళ్లి కిందకు దింపివేయించడం కనిపించింది. జగన్ రోడ్‌షో కోసం వైసీపీ నేతలు భారీగా జన సమీకరణకు వ్యూహం రచించారు. అందుకోసం మహిళలకు రూ.200, పురుషులకు రూ.300 చొప్పున ఇస్తామని చెప్పినప్పటికీ పెద్దగా స్పందన కనిపించలేదు. ఆటోల్లో తరలించినప్పటికీ గంటల తరబడి వేచి ఉండలేక కొంతమంది తమ పేర్లను నమోదుచేసుకున్న తర్వాత, మరికొందరు తమ పేర్లను నమోదుచేయించుకోకుండానే వెనుతిరిగి వెళ్లిపోవడం వైసీపీ నేతలను ఆశ్చర్యానికి గురిచేసింది.

మహిళలకు ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్

సీతంపేట, ఏప్రిల్ 21: మహిళలకు మే 10వ తేదీ నుంచి పీవీజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్ నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నుంచి 30 ఏళ్ల లోపు బాలికలు, మహిళలకు ఈ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులను బీచ్‌రోడ్డులో వైఎంసీఏ ఎదురుగా బీచ్ వద్ద, గోపాలపట్నం ఉన్నత పాఠశాల, భీమిలిలో వారం పాటు జరుగుతాయన్నారు. పీఎస్ఆర్ అకాడమీఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి పి.నరసింహారావు, శివరామకృష్ణ, చైతన్య, డాక్టర్ సతీష్ కొల్లి, ప్రొఫెసర్ వి.పూజారి, కేకే రాజు, ప్రవీణ్. జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 21: గొల్లలపాలెం పాత జైల్ రోడ్డు వద్ద శెట్టి బలిజ సం ఘం ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శ్రీ కోదండ సీతారామాంజనేయ ఆలయంలో శ్రీరామనవమిఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం మహా అన్న ప్రసాద వితరణ చేపట్టారు.ఆలయ కమిటీ నాయకులు బడితమాని ఈశ్వరరావు, సమంగి కోటేశ్వరరావు, రంగాల శ్రీనివాస వర ప్రసాద్, కోస్టు శ్రీను పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 21: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సంత్రాగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రాగచ్చి

08845 నంబరు గల రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు దువ్వాడ, ఆదివారం ఉదయం తెల్లవారుజాము 2.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 3.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 8.55కు దువ్వాడ, సోమవారం ఉదయం 10.48 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది.

కొయంబత్తూరు-బరౌని-కొయంబత్తూరు

06059 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 3.45కు కొయంబత్తూరు చేరుతుంది.

శ్రీభరత్ నామినేషన్‌కు తరలిరండి : గంటా నూకరాజు

భీమునిపట్నం, ఏప్రిల్ 21 : టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఉదయం 8 గంటలకు బీచ్‌రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని చెప్పారు. అక్కడి నుంచి వాహనాలతో ఊరేగింపుగా ఎంవీపీ కాలనీలో వున్న పార్టీ కార్యాలయానికి చేరుకోనున్నట్టు చెప్పారు.

అప్పన్న వార్షిక కల్యాణోత్సవాల్లో నేడు

సింహాచలం, ఏప్రిల్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం వేకువ జామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు, విశేష హోమాలు, బాల భోగం నివేదనం, గ్రామ బలిహరణం జరుగుతాయి. ఉదయం 6.30 గంటలకు మంగళాశాసనం, ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు భక్తులకు సర్వ దర్శనాలు, మధ్యాహ్నం 11.30 గంటలకు మహా రాజభోగము చేపడతారు.11.30 నుంచి 12.30 గంటల వరకు దర్శనాలు ఉండవు. సాయంత్రం 5 గంటలకు సూర్య ప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం, రాత్రి 7 నుంచి ఆరాధన, నివేదనం, హోమాలు, గ్రామ బలిహరణం, మంగళాశాసనము, రాత్రి 10 గంటలకు పవళింపు సేవ, అనంతరం కవాట బంధనం చేయనున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కొమ్మాది, ఏప్రిల్ 21 : తన భర్త ఆచూకీ తెలియలేదని భార్య పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. చిటికెల గోవింద భార్యతో కలిసి కొమ్మాది కోస్టల్ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్నాడు. అతను గతంలో రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసేవాడు. ఇటీవల అక్కడ పని చేయడం మానేసాడు. ఈనెల 14న అదే కంపెనీ పని మీద ఢిల్లీ వెళ్తున్నట్టు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. 16న ఉదయం అతని భార్య కనక మహాలక్ష్మి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. 17న కూడా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, అతని ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

టీఎన్ఎస్ఎఫ్ నేత గృహ నిర్బంధం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 21 : టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్‌ను ఎంవీపీ పోలీసులు ఆదివారం గృహ నిర్బంధం చేశారు. ఈమేరకు ఆయనకు నోటీసులు అందజేశారు. నగరంలో ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో ప్రణవ్‌గోపాల్ నిరసన కార్యక్రమాలు చేసే అవకాశం ఉన్నట్టు తమకు సమాచారం ఉందని, దీంతో ఆయన్ను గృహ నిర్బంధం చేస్తున్నట్టు నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే ఇలా నిర్బంధిస్తారా అంటూ గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కాలరాస్తారని విమర్శించారు.

నిత్యావసర సరకులు పంపిణీ

తగరపువలస, ఏప్రిల్ 21 : తగరపువలసలోని తాతా థియేటర్ సమీపంలో ఉంటున్న నిరుపేద వృద్ధురాలు నమ్మి సింహాచలంకి వీఎస్ఆర్ సేవా సంస్థ ఆదివారం నెల రోజులకు సరిపడ నిత్యావసర సరకుల్ని అందించారు. అనాథ అయిన ఆమె కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న సభ్యులు సరకులు అందజేశారు.

ఆధ్యాత్మిక గ్రంథాలు పంపిణీ

తగరపువలస, ఏప్రిల్ 21 : స్థానిక బాలాజీనగర్‌లో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం ఇంటింటి ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. భగవద్గీత ప్రచారంలో భాగంగా వీటిని పంపిణీ చేసినట్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ. త్రినాథరావు, వి. భవాని, లక్ష్మి, బంగారు తల్లి, మంగమ్మ పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.60 వేలు విరాళం

సింహాచలం, ఏప్రిల్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాదానికి ఇద్దరు దాతలు సోమవారం రూ. 60 వేలు విరాళంగా సమర్పించారు. భీమసింగి గ్రామానికి చెందిన ఎన్. సాయి రోహిత్ రూ. 50,005, శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎల్‌వీఎస్ సరస్వతి రూ.10,116లను నగదు రూపంలో అన్న ప్రసాదం విభాగం ఇన్‌చార్జి ఏఈఓ నరసింగరావుకు అందజేశారు.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం :** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్ :** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి :** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 42, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 22, క్యారెట్ 36, దొండకాయలు 30, బంగాళా దుంపలు 25, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 150, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, ఆగాకర 72, పొటల్స్ 70, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 11 లో..



మద్దిలపాలెం జాతీయ రహదారిపై మూసివేసిన దుకాణాలు



జాతీయ రహదారిపై తెరిచి ఉన్న వైసీపీ నాయకుడికి చెందిన బార్ అండ్ రెస్టారెంట్

జగన్ రోడ్ షోతో ప్రజలకు కష్టాలు

- ఎక్కడికక్కడ దుకాణాలు మూసివేత
- భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్
- పోలీసుల తీరుపై వాహనదారుల అసహనం

మద్దిలపాలెం, ఏప్రిల్ 21 : ముఖ్యమంత్రి జగన్ రోడ్‌షో వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం జరిగిన రోడ్ షోకు పోలీసులు ఉదయం నుంచే ఆంక్షలు పెట్టారు. మద్దిలపాలెం జాతీయ రహదారిపై తోపుడు బళ్లు, టిఫెన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూయించారు. ఈమేరకు వ్యాపారులకు ముందు రోజు రాత్రే హుకుం జారీ చేశారు. మద్దిలపాలెం జాతీయ రహదారిపై వందకు పైగా చిరు దుకాణాలున్నాయి. ఉదయం నుంచే షాపులు మూయించడంతో వారంతా ఒక రోజు వ్యాపారాన్ని నష్టపోయారు. దుకాణాలన్నీ మూయించిన పోలీసులు మద్దిలపాలెం జంక్షన్‌లో ఉన్న త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్‌కు మాత్రం ఎలాంటి ఆంక్షలు విధించలేదు. ఉదయం 8 గంటల నుంచే బార్ యథావిధిగా తెరిచి అమ్మకాలు కొనసాగించడం విశేషం. 23వ వార్డు వైసీపీ కార్పొరేటర్ భర్త గుడ్ల సత్యరెడ్డికి చెందిన బార్ అండ్ రెస్టారెంట్ కావడంతో పోలీసులు ఆటువైపు కన్నెత్తి కూడా చూడలేదని పలువురు విమర్శించారు.



వచ్చివారికి కూపన్లు రాస్తున్న వైసీపీ నాయకులు

గంటల కొద్దీ ఎదురుచూపు

మద్దిలపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 23వ వార్డు వైసీపీ నాయకులు జగన్ బస్‌యాత్ర కోసం భారీగా జన సమీకరణ చేశారు. మద్దిలపాలెం నుంచి భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. మహిళలను కూడా తరలించేందుకు సన్నాహాలు చేశారు. జనాలకు కూపన్లు పంచి మరీ వందల సంఖ్యలో జన సమీకరణ చేశారు. సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం జంక్షన్‌లో ఉండాలని అందర్ని పిలిచారు. 4 నుంచి జగన్ బస్ కోసం జనం ఎదురుచూపు చూశారు. ఎంతకీ రాకపోవడంతో కొందరు వెనుదిరిగారు.

ఆరిలోవ : జగన్ బస్సు యాత్రకు హనుమంతవాక జంక్షన్‌లో జనం చాలా తక్కువ మంది ఉన్నారు. ఒకవైపు జనం లేక పోవడం, మరోవైపు దుకాణాలు మూసివేయడంతో రోడ్లన్నీ బోసిపోయాయి. ఆర్‌టీసీ బస్సులు లేకపోవడంతో హనుమంతవాక జంక్షన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హనుమంతువాకజంక్షన్ కొండవాలును ఆనుకుని ఉన్న తోపుడు బళ్లను మధ్యాహ్నం నుంచి మూసివేశారు.

వెంకోజీపాలెం : జగన్ బస్సు యాత్రలో భాగంగా ఇసుకతోట ప్రాంతంలో వేచి వున్న కార్యకర్తలు అటు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం కలిగించారు. జగన్‌ను చూసేందుకు వచ్చిన కార్యకర్తలు సాయంత్రం 6 గంటల నుంచి ఇసుకతోట జంక్షన్ వద్ద గుమ్మిగూడారు. 8.30 గంటలకు వచ్చిన జగన్ కోసం వేచి ఉన్న కార్యకర్తలతో దాదాపు రెండున్నర గంటల పాటు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు రోప్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసినా కార్యకర్తలు మాత్రం ఆత్రుతతో రోడ్డుకు మధ్యలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనారు.

108 కలశాలతో పోలాంబకు పూజలు

ఆరిలోవ, ఏప్రిల్ 21 : చినగదిలిలో జరుగుతున్న పోలమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 కలశాలతో మహిళలు ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుడు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

'చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిత'



విజయనగరం ప్యాలెస్‌లో ప్రచారం చేస్తున్న సుజన, తదితరులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 21 : చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సుజన అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె పెదవాల్తేరు, విశాఖ ఐ హాస్పటల్, విజయనగరం ప్యాలెస్ ప్రాంతాల్లో పర్యటించారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. తూర్పు ఎమ్మెల్యేగా మళ్లీ వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పద్మజ, సీతా మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

98 మందికి హోమియో మందులు పంపిణీ



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం, ఏప్రిల్ 21 : పట్టణంలోని చిన్నబజారు డచ్ రోడ్‌లో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం ఆవరణలో ఆదివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు జగన్నాథరావు, మోహన్ 98 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించిన ఈ శిబిరంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, చంద్రశేఖర్, భానోజీరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

చందనోత్సవంలో సేవా సంస్థల సేవలు కీలకం

సింహాచలం, ఏప్రిల్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు ఎంతో కీలకమని దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి అన్నారు. వచ్చే నెల 10న జరిగే చందనోత్సవం విజయవంతం చేసే ప్రణాళికలో భాగంగా సోమవారం సింహగిరిపై యాత్రిక్ సదన్ భవనంలో సేవా సంస్థల ప్రతినిధులతో ఈఓ సమావేశం నిర్వహించారు. సంస్థలు చేయదలచిన సేవల గురించి అధికారులు అడిగి తెలుసుకున్నారు. సంస్థలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈఓ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఈఓలు ఆనందకుమార్, రాజేంద్రకుమార్, ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కట్టు కథలు నమ్మొద్దు

- భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- నియోజకవర్గంలో పలుచోట్ల ప్రచారం

మధురవాడ, ఏప్రిల్ 21 : భీమిలి నియోజకవర్గంలో ఐదేళ్లుగా అభివృద్ధి పనులు చేపట్టానని, ఆ పనులను చూసి ప్రజలు తనను ఈసారి కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన ఏడో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్వతంత్రనగర్ కాలనీలో ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఇటీవల సోషల్ మీడియాలో తాను అనకాపల్లి ఎంపీగా పోటీ చేయనున్నట్టు అసత్య ప్రచారం చేశారని, అలాంటి కట్టుకథలు ప్రజలు నమ్మొద్దన్నారు. మధురవాడ పరిసరాల్లోని ప్రతి కాలనీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వలస నాయకులు వస్తూ.. పోతూ.. ఉంటారని వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలకు లక్షల కోట్ల రూపాయల సంక్షేమ పథకాలు అందాయని, అవి కొనసాగాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మీని గెలిపించాలన్నారు. అనంతరం స్వతంత్రనగర్ కాలనీకి చెందిన పలువురు వైసీపీలో చేరగా వారికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ పోతిన శ్రీనివాసరావు, పిళ్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాదిలో ముత్తంశెట్టికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

పేదల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి జగన్

కొమ్మాది : పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన 5వ వార్డు లక్ష్మీటవర్స్ అపార్టుమెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో భీమిలి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఈసారి ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే విశాఖను పరిపాలనా రాజధాని చేస్తారని, దీని వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ, జనసేన నాయకుల మాయమాటలు నమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిన హనుమంతురావు, లక్ష్మీ టవర్స్ గృహ సముదాయం సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాస్, దుర్గారావు, విశ్వనాథం, రామారావు, సత్యనారాయణ, జగదీష్, అప్పారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీనివాసరావు సమక్షంలో వైసీపీలో చేరిన బోయవీధి మత్స్యకారులు

వైసీపీలో పలువురి చేరిక

భీమునిపట్నం : ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన మహిళలు, యువకులు వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బోయవీధికి చెందిన సీహెచ్ ఊర్మిళ, కదిరి ఎల్లాజీతో పాటు మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు గురవయ్య రెడ్డి ఉన్నారు. అలాగే 2వ వార్డు నమ్మివారిపేటకు చెందిన నమ్మి మాధవ ఆధ్వర్యంలోను, రెడ్డి సంతపేట నుంచి ఉప్పాడ నాని, కొత్తయ్య రెడ్డి ఆధ్వర్యంలో యువకులు, బీచ్ ఫొటోగ్రాఫర్లు 40 మంది వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, మైలపల్లి షణ్ముఖరావు, కరుణాకర్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కదిరి ఎల్లాజీ, గుండాసు మధునాయుడు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న ప్రభ రామకృష్ణ సోమయాజి, వేణుగోపాలుడి అలంకరణలో స్వామివారు

నారసింహ భక్తితత్వాన్ని చాటిన వేద పండిత సదస్యం

సింహాచలం, ఏప్రిల్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో జరిగిన పండిత సదస్యం నారసింహ భక్తితత్వాన్ని చాటిచెప్పింది. సదస్యంలో ప్రధాన వక్తగా తిరుపతి శ్రీవేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆచార్యులు ప్రభ రామకృష్ణ సోమయాజీ ఉపన్యసించారు. భక్త ప్రహ్లాదుడు ద్వారా పరమాత్మ భక్తులపై వాత్సల్యాన్ని ప్రదర్శించిన విధానాన్ని భాగవతంలో పోతనామాత్యుడు వర్ణించిన తీరుపై ఆయన ప్రసంగించారు. దేవస్థానం స్థానాచార్యులు రాజగోపాల్ ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి దరహాసాన్ని, నేటి అలంకారం వేణుగోపాలుడి విశేషాలను తెలియజేశారు. అనంతరం దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్, ఈఓ శ్రీనివాసమూర్తి సదస్యంలో పాల్గొన్న వేద పండితులను సత్కరించారు. ఈకార్యక్రమానికి దేవాలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు వెంకటరమణాచార్యులు సారథ్యం వహించగా ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు ఉత్సవమూర్తిని వేణుగోపాలుడిగా శోభాయమానంగా తీర్చిదిద్ది షోడశోపచారాలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేద పండితులు గోదావరి సురేష్ శర్మ, రామాయణం జగన్మోహన్ శర్మ, కపిలవాయ్ అగ్ని రామకుమార్ శర్మ, లలిత్ కుమార్ శర్మ, రాజేష్ శర్మ, అనూప్‌కుమార్ శర్మ, సోమయాజులతో వంద మందికిపైగా పండితులు పాల్గొన్నారు.

'సంస్కృతాన్ని కాపాడుకుందాం'

విశాలాక్షినగర్, ఏప్రిల్ 21 : రాష్ట్ర ప్రభుత్వం సంస్కృతం భాషను నిర్వీర్యం చేయాల్సి చూస్తుందని, ప్రభుత్వం నుంచి భాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని సంస్కృత భారతి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుందర్ రాజ పెరుమాళ్ అన్నారు. ఆదివారం 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాలలో విశాఖ జానపద సంస్కృత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంస్కృత భాషను పాఠశాల, కళాశాలల పాఠ్యాంశాల నుంచి తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సంస్కృతాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ప్రచార పరిషత్ కార్యదర్శి వావిలాల మురళీకృష్ణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పి. సోమరాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, భాగవతులు ట్రస్టు కార్యదర్శి శ్రీరామ్మూర్తి, ఆర్ఎస్ ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్, సంస్కృత భారతి కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది.



సంస్కృతిక సమ్మేళనంలో పాల్గొన్న పండితులు

16వ వార్డులో ఎంవీవీ విస్తృత ప్రచారం



ఓటరుతో ఎంవీవీ మాటామంతీ



కేఆర్ఎం కాలనీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 21 : తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం 16వ వార్డులోని కృష్ణా కళాశాల ప్రాంతం, కేఆర్ఎం కాలనీ, భానునగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా.. పేదలు అభివృద్ధి చెందాలన్నా.. జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని చెప్పారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి రావడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని, జగన్ అమలు చేసిన పథకాలే తమకు శ్రీరామ రక్ష అని చెప్పారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయడానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచిన తరువాత విశాఖలోనే సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు. వెలగపూడి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, ఐసీఎస్ కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, చొల్లంగి నాగేశ్వరరావు, పల్లా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'భారత్‌ను విశ్వ గురువుగా తీర్చిదిద్దుదాం'

వెంకోజీపాలెం, ఏప్రిల్ 21 : భారత్‌ను విశ్వ గురువుగా తీర్చిదిద్దుదామని ఏఐసీటీఈ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ద చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బ్రెయిన్‌ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత్‌ను సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడంలో దేశానికి అవసరమైన మానవ వనరుల తయారీలో ఆచార్యుల పాత్ర కీలకమన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి విజయానికి నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. బ్రెయిన్ ఓ విజన్ సంస్థ సీఈఓ డి. గణేష్ నాగు మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 320 మంది అధ్యాపకులు, కళాశాలల నిర్వాహకులు, ప్లేస్‌మెంట్ అధికారులు, పరిశోధకులకు అవార్డులు ప్రదానం చేశామన్నారు. అనంతరం విద్య, పరిశోధన రంగాల్లో సేవలందిస్తున్న ఆచార్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ డైరెక్టర్ జి. భాస్కర్, కృష్ణప్రసాద్, రవి ప్రసాద్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు



సర్వజన మనోరంజని వాహనంపై అప్పన్న

సింహాచలం, ఏప్రిల్ 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై స్వామివారి తిరువీధి నిర్వహించారు. వేదపండిత సదస్యం అనంతరం గోవిందరాజస్వామిని వేణుధరుడిగా అలంకరించి సర్వజన మనోరంజని వాహనంపై అధిష్ఠింపజేశారు. కళాకారులు నృత్యాలు, కోలాటాలు ఆడుతుండగా, ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి తిరువీధి వైభవంగా నిర్వహించారు.